సాక్షి చిత్తూరు

శుక్రవారం । 14 । జూలై । 2023



చెడు వ్యసనాలకు బానిసై...

చెడు వ్యసనాలకు బానిసై బైక్‌ల దొంగతనం చేస్తున్న ఇద్దరిని చిత్తూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. - IIలో



నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ

టీటీడీ స్థానికాలయాల్లో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచిస్తున్నట్టు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	26
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

కంటైనర్ యార్డుకు శ్రీకారం

- చిత్తూరు నగరానికి సమీపంలో ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన కలెక్టర్
- అనుమతులు వచ్చిన వెంటనే పనులు



కంటైనర్ యార్డు ఏర్పాటుపై విదేశీ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ సగిలి షణ్మోహన్(ఫైల్)



జిల్లా నుంచి పంట ఉత్పత్తులను చెన్నై పోర్టుకు తరలిస్తున్న కంటైనర్

సాక్షి, చిత్తూరు: జిల్లాలో కంటైనర్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపింది. ఇక్కడ ఉత్పత్తయ్యే ఉద్యాన పంటలకు, గ్రానైట్‌కూ విదేశాల్లో డిమాండ్ బాగా ఉంది. కానీ అక్కడికి ఎగుమతి చేయాలంటే సమీపంలోని చెన్నై, కృష్ణపట్నం పోర్టులకు తరలించాల్సి ఉంది. అక్కడ సరుకు నిల్వలు పేరుకుపోవడంతో నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. దీంతో ఆహార పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ సగిలి షణ్మోహన్ కంటైనర్ యార్డు జిల్లాలోనే ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

రూ.2 వేల కోట్ల ఎగుమతులు

జిల్లా నుంచి గ్రానైట్ సుమారు 3.5 లక్షల టన్నులు, మామిడి ఉత్పత్తులు 2.5 లక్షల టన్నుల మేరకు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇలా ఏటా సుమారు రూ.2వేల కోట్ల ఉత్పత్తులు జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నట్లు అధికారుల అంచనా.

సరిహద్దు ప్రాంతమే అనుకూలం

మూరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు జిల్లా కంటైనర్ యార్డు ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. ఇక్కడి నుంచి పోర్టులకు రవాణా సదుపాయం మెరుగ్గా ఉంది. తద్వారా జిల్లా నుంచి ఎగుమతులు క్రమంగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చెన్నై, కృష్ణపట్నం పోర్టుల్లోని కంటైనర్ యార్డులకు తరలించి, అక్కడి నుంచి ఎగుమతి చేయాలంటూ ఎక్కువ సమయం పడుతోందని కలెక్టర్ షణ్మోహన్ గుర్తించారు. ఈ జాప్యాన్ని నివారిస్తే ఎగుమతులు పెంచే అవకాశం ఉంటుందని భావించారు. పోర్టులు, సరుకు రవాణాపై తనకున్న అనుభవంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలోనే కొత్తగా కంటైనర్ యార్డు ఏర్పాటు చేస్తే ఎగుమతితోపాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇందులో భాగంగానే విదేశాల్లో కంటైనర్ యార్డులు నిర్వహించే సంస్థలతో చర్చించారు. డిపి గ్రూప్, ఏపీటీపీసీ వంటి సంస్థలతో పాటు జిల్లాలోని వివిధ పరిశ్రమల యజమానులతో కలెక్టర్ ఇప్పటికే సంప్రదింపులు జరిపారు.

సిద్ధంపల్లి వద్ద కంటైనర్ డిపో ?

చిత్తూరు రూరల్ పరిధిలోని సిద్ధంపల్లి సమీపంలో ఈ కంటైనర్ యార్డు ఏర్పాటుకు అనుకూల స్థలాన్ని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒకవైపు రైల్వే స్టేషన్, మరో వైపు జాతీయ రహదారులు ఉండడంతో రవాణాకు అనుకూలంగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో కొత్త యార్డు ఏర్పాటుకు తొలి దశలో 30 ఎకరాలు అవసరమని భావిస్తున్నారు. మలి దశలో అవసరాన్ని బట్టి విస్తరించేలా కార్యాచరణ రూపొందించారు.

సకాలంలోనే జిల్లా ఉత్పత్తుల ఎగుమతి



జిల్లా నుంచి ఎగుమతులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ కంటైనర్ యార్డు ఏర్పాటు చేస్తే మామిడి పండ్ల పరిశ్రమలకు, గ్రానైట్ పరిశ్రమలకు ఎక్కువగా ఉపయోగకరంగా ఉంటుంది. వచ్చిన ఆర్డర్ల మేరకు సకాలంలో ఇతర దేశాలకు జిల్లా ఉత్పత్తులు పంపే అవకాశం ఉంటుంది.

– గోవర్ధన బాబీ, జిల్లా కార్యదర్శి, పండ్ల పరిశ్రమల సంఘం

సకాలంలో ఎగుమతులు



జిల్లా నుంచి గ్రానైట్ స్లాబులతోపాటు రా బ్లాక్‌లు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దీనికోసం చెన్నైలోని యార్డులను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే చాలా ఆర్డర్లు సకాలంలో చేరడం లేదు. ఇక్కడ కంటైనర్ యార్డ్ ఏర్పాటు చేస్తే సకాలంలో ఎగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది.

– ఇ.విఠల్ రెడ్డి, గ్రానైట్ పరిశ్రమ యజమాని

కొత్త పరిశ్రమలకు అవకాశం



చెన్నై యార్డుల్లో కంటైనర్లు ఖాళీగా లేకపోవడం వల్ల ఎగుమతులు సకాలంలో చేరడం లేదు. వీటన్నిటికీ చెక్ పెట్టే విధంగా ఉత్పత్తిదారులకు లాభం చేకూరేలా కంటైనర్ యార్డ్ జిల్లాలో ఏర్పాటు చేస్తే అందరికీ అనువుగా ఉంటుంది. దీంతోపాటు అనుబంధంగా ఉండే కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది.

–కె.ఎల్.వి.ప్రసాద్, గనుల శాఖ జిల్లా అధికారి

ప్రభుత్వానికి ఆదాయం



జిల్లాలో కంటైనర్ యాడ్ ఏర్పాటు చేస్తే ఎగుమతులు పెరుగుతాయి. పంట ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అందుకే ఈ కొత్త యార్డు ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు వచ్చిన తర్వాత పనులు ఆరంభిస్తాం.

– సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

న్యూస్‌రీల్

పుంగనూరులో ఏరియా ఆస్పత్రి



సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ శరణ్ తదితరులు

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసుపత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్లు, సిబ్బంది కలసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. డాక్టర్ శరణ్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి చొరవతోనే ఈ 100 పడకల ఆస్పత్రి సాధ్యమైందని చెప్పారు. ఇక మీదట ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు, అత్యవసర సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ సభ్యులు ఇనాయతుల్లా షరీఫ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులు పేర్లు నమోదు చేసుకోవాలి

చిత్తూరు రూరల్: దేవదాయశాఖలో పనిచేస్తున్న అర్చకులు 43 రిజిస్టర్, వంశపారంపర్య అర్చకుల గుర్తింపునకు పేర్లు నమోదు చేసుకోవాలని శాఖ జిల్లా సహాయ కమిషనర్ ఏకాంబరం తెలిపారు. 6ఏలో పనిచేస్తున్న అర్చకులు తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్‌కు, 6బీలో పనిచేస్తున్న అర్చకులు కర్నూలులోని ఉప కమిషనర్‌కు, 6సీలోని ఆలయ అర్చకులు చిత్తూరు సహాయ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని గమనించి వారంలోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

నేడు నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై ఈ నెల 14న కలెక్టరేట్‌లో నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె విలేకరులతో గురువారం మాట్లాడుతూ సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కమిటీ చైర్మన్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. పర్యవేక్షణ కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని డీడీ కోరారు.

ధరల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బియ్యం, పప్పు ధాన్యాల ధరల నియంత్రణపై చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పౌరసరఫరాల శాఖ, బియ్యం, పప్పుధాన్యాల హోల్‌సేల్ డీలర్ల, మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అధిక ధరలకు బియ్యం, పప్పు ధాన్యాలను విక్రయిస్తే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పౌరసరఫరా, మార్కెటింగ్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతుబజార్లలో ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో శంకరన్, డీఎం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య హక్కులు కల్పించడంపై హర్షం



ముఖ్యమంత్రి పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సదుం: స్థానిక అంబేడ్కర్ భవనంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి గురువారం నాయకులు పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో 54 వేల ఎకరాల అసైన్‌మెంటు భూములపై యాజమాన్య హక్కులు కల్పించేలా కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు ఈ నిర్ణయంతో మరోసారి రుజువు అయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఆ పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ ఉషారాణి, నాయకులు సీతాపతి, ఎల్లారెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా చేద్దామని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్వామివారి సమావేశపు మందిరంలో గురువారం ఆలయ చైర్మన్, ఈఓ ఆధ్వర్యంలో ఆలయ అర్చక వేదపండితులకు, అధికారులకు సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి నుంచి నిర్వహించే స్వామివారి నవరాత్రి ఉత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. బ్రహ్మోత్సవ టెండర్లు, నిర్వహణ, భక్తులకు ఇబ్బందుల్లేకుండా దర్శన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేసేందుకు నిర్ణయించారు. దీనిపై ఉభయదారులతో ప్రత్యేకంగా సమావేశమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, సూపరింటెండెంట్‌లు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతిలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి అధికారిణి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్ కమ్ అసిస్టెంట్-4, జూనియర్ అసిస్టెంట్ -1, డేటా ఎంట్రీ ఆపరేటర్ -1, స్టెనో-1, రికార్డ్ అసిస్టెంట్ -2, అటెండర్-7, ఆఫీస్ సబార్డినేట్ -1 పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరులోని ఉపాధి కార్యాలయంలో దరఖాస్తులు పొంది, ఈనెల 22వ తేదీలోపు కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

అజ్ఞానిపై ఆగ్రహజ్వాల



కల్లూరులో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మతో వలంటీర్ల నిరసన



పాలసముద్రంలో వలంటీర్ల మానవహారం



తవణం పల్లెలోని టి.పుత్తూరు రోడ్డులో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న వలంటీర్లు



చిత్తూరులో గాంధీజీ విగ్రహం ఎదుట పవన్ పోస్టర్‌ను తగులబెడుతున్న వలంటీర్లు

ప్రతిష్టాత్మకంగా ఆలయ నిర్మాణం

- ద్వారబంధన ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా



ద్వారబంధన పూజల్లో మంత్రి ఆర్కేరోజా

నగరి : నేత్ర ప్రదాత, గ్రామదేవత దేశమ్మ దేవాలయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా గురువారం నిర్వహించిన ద్వారబంధన ఏర్పాటు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మంత్రిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన హోమపూజల్లో పాల్గొన్న మంత్రి ద్వారబంధనానికి సిద్ధం చేసిన రాతిస్తంభాలకు పసుపుకుంకుమలు రాసి పూజలు చేశారు. అనంతరం క్రేన్ సాయంతో ద్వారబంధనాన్ని నిర్ణయించిన ప్రాంతంలో ఏర్పాటు చేశారు. మంత్రి రోజా మాట్లాడుతూ దేశమ్మ ఆలయాన్ని పునర్నిర్మించడం ఆ దేవత తనకు ఇచ్చిన అనుగ్రహం అన్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం ముఖ్యమంత్రి సాయంతో రూ.1.2 కోట్లు మంజూరు చేయించగలిగామన్నారు. త్వరలో అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. వేద పండితులు మంత్రోచ్ఛారణలతో మంత్రిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునిశేఖర్, మాజీ చైర్మన్ దయానిధి, ఆలయ ధర్మకర్తలు విజయ్, అర్ముగం, రాజేష్, శేదు, బాబు, కౌన్సిలర్ ఇంద్రయ్య, ఆర్సీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు శశికుమార్, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆధార్‌కార్డుల జారీ

- జలజీవన్ మిషన్ పెండింగ్ పనులకు అనుమతులు
- ఉపాధి హామీలో లక్ష్యాలను పూర్తి చేయండి
- అంగన్‌వాడీల్లో కిచెన్ గార్డెన్‌లు తప్పనిసరి
- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాలు



ఫీవర్ సర్వే బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా చిన్నారుల ఆధార్‌కార్డుల జారీ చేసేందుకు కసరత్తును పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఆయన గురువారం పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్నపిల్లలకు 78 శాతం ఆధార్‌కార్డులను జారీ చేసినట్లు చెప్పారు. ఆగస్టు 15 నాటికి అత్యధిక శాతం ఆధార్‌కార్డులు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పనులు పూర్తి చేసి బిల్లులను సకాలంలో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లాలో ఆదర్శ గ్రామాల కింద ఎంపికైన ఊళ్లలో 600కు తగ్గకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో పురోగతి తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో ఓడీఎఫ్ జియో ట్యాగింగ్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని వివరించారు. జలజీవన్ మిషన్‌లో చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోపు ప్లానిటేషన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపికచేసిన ప్రాంతాల్లో గుంతలు తవ్వే కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖలో పనులను స్టేజీల వారీగా వేగవంతంగా చేపట్టాలన్నారు. పనులు ప్రారంభించని గృహాలుంటే ఆ గృహాలకు మంజూరు చేసిన పట్టాలను రద్దు చేయాలని చెప్పారు. లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాలోని 612 గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ఆ నిధులను వినియోగించుకుని గ్రామాల్లో అవసరమైన పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్‌లను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం జిల్లాలోని 2420 అంగన్‌వాడీ కేంద్రాలకు విత్తనాలను అందజేయనున్నట్లు వివరించారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా ఫీవర్ సర్వే

జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే బాధ్యతాయుతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యశాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో వెల్లడయ్యే వ్యాధులకు సకాలంలో వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఈ సర్వేను బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది దోమలువ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ముందస్తు కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య పనులకు వినియోగించే వాహనాలు, సిబ్బంది పనితీరుపై నివేదిక పంపాలని ఆదేశించారు. ఫ్రైడేని డ్రైడేగా నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలకు అవసరమయ్యే పరికరాల వివరాల నివేదికను పంపితే ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఫీవర్ సర్వే, డెంగీ వ్యాధుల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమీక్ష సమావేశాల్లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీఎంహెచ్‌వో ప్రభావతి, మలేరియా అధికారి శ్రీనివాసులు, డాక్టర్ రవిరాజు, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



మహిళా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు వివిధ క్రీడల్లో నైపుణ్యాలను సాధించాలని ఆ సంస్థ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఆ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మహిళల కోసం ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యోగినులతో కలిసి సరదాగా క్యారమ్స్, చెస్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. తదనంతరం ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న టెన్నిస్ కోర్టును పరిశీలించారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, లక్ష్మీనరసయ్య, వరకుమార్, జాయింట్ సెక్రటరీ రాధాజయశ్రీ, జనరల్ మేనేజర్లు గోపాలకృష్ణ, సూపరింటెండింగ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, రూపలత, వాసవీలత, చలపతి, అశోక్‌కుమార్, నరసింహబాబు, బాలాజీ, అమీర్ బాషా, రాజు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

- రాజంపేట–కదిరి, బైరెడ్డిపల్లె–చిన్నగొట్టిగల్లు జాతీయ రహదారులుగా మార్పు
- అనుమతులు కోరుతూ కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి ఎంపీ మిథున్‌రెడ్డి వినతి



కేంద్రమంత్రికి శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని నియోజకవర్గాల్లో రహదారి అభివృద్ధి పనులకు సహకరించాలని కేంద్ర జాతీయ రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. గురువారం మదనపల్లె పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి బీటీ కళాశాల గ్రౌండ్స్ హెలిప్యాడ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్వాగతం పలికారు. ఆయనతో కలిసి పట్టణంలోని నక్కలదిన్నెలో పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన స్వాస్థ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేట పార్లమెంటరీ పరిధిలో రహదారుల అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను అందించి, అనుమతులు, నిధులను మంజూరు చేయాల్సిందిగా కోరారు. అనంతపురం(ఉరవకొండ) నుంచి కృష్ణగిరి ఎన్‌హెచ్–42 జాతీయరహదారి మదనపల్లె పట్టణం మీదుగా ఏడు కిలోమీటర్లు వెళుతుండడంతో ట్రాఫిక్‌జామ్, ప్రమాదాల నివారణ, ప్రయాణ సమయం తగ్గించేందుకు 2023–24 ప్రణాళికలో వన్ టైమ్ ఇంప్రూవ్‌మెంట్ కింద తాత్కాలికంగా రూ.20 కోట్లు విడుదలతో పాటుగా అనుమతులు ఇవ్వాల్సిందిగా కోరారు. 2022–23 వార్షిక ప్రణాళికలో పుంగనూరు పట్టణంలో బైపాస్ రీచ్ రెండులేన్ల రహదారిని విస్తరించేందుకు అనుమతులు మంజూరుచేశారని, పట్టణంలో ప్రధానరహదారిని సెంట్రల్ డివైడర్‌తో లైటింగ్ ఏర్పాట్లుతో చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా పోర్ట్ కనెక్టివిటీ కోసం స్టేట్ హైవేలుగా ఉన్నటువంటి రాజంపేట–కదిరి(వయా.రాయచోటి), బైరెడ్డిపల్లె నుంచి పుంగనూరు (ఎస్‌హెచ్–498), పుంగనూరు–చిన్నగొట్టిగల్లు (ఎస్‌హెచ్–065)ను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

16 నుంచి ఏడుకొండల నృత్యోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుమలలోని ఆస్థాన మండపం వేదికపై శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఏడుకొండల నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు పల్లెంశెట్టి సురేష్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు కొండలపై ఏడేళ్లు, ప్రతి నెలా 7వ తేదీన 700 మంది కళాకారులతో, ఏడు రకాల భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో శ్రీవేంకటేశ్వరస్వామిని నీరాజనం అర్పించాలన్నది కూచిపూడి ముని కుంట్ల సాంబశివ సంకల్పమన్నారు. తొలిసారిగా తిరుమలలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చీటీల వ్యాపారుల దౌర్జన్యాలపై ఫిర్యాదు

పలమనేరు: అధిక వడ్డీలు, అక్రమ ఫైనాన్స్‌లు, అనధికారిక చీటీల నిర్వాహకుల దౌర్జన్యాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయని డీఎస్పీ సుధాకర్‌రెడ్డికి గంటావూరు కాలనీకి చెందిన పలువురు గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితులు సురేష్ తదితరులు మాట్లాడుతూ.. తమ కాలనీకి చెందిన మార్కొండ, పళని కొన్నేళ్లు గా అధిక వడ్డీలకు ఫైనాన్స్, అనధికారిక చీటీలను నిర్వహిస్తూ పేదల రక్తాన్ని పీల్చుతున్నారని తెలిపారు. చీటీల విషయంగా తనను వారింటికి పిలిపించి ఇంట్లో బంధించి తమపై దాడి చేశారని ఆరోపించారు. వారం, నెల చీటీల పేరిట రూ.లక్షల్లో జనం నుంచి వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. వీరి కారణంగా ఈ ప్రాంతంలో చాలామంది అప్పులు పాలై గ్రామం విడిచి పోయారని పేర్కొన్నారు. ఇలాంటి వారి కారణంగా తనకు ప్రాణ హాని ఉందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

కోట్లు దోచేసి.. సెల్ఫీలతో ఫోజులా?

- 'గాలి'పై మంత్రి ఆర్కే రోజా ఫైర్
- పండుగ వాతావరణంలో జగనన్న సురక్ష



పుత్తూరు జగనన్న సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పట్టణంలో నిర్మాణాల పేరిట కోట్లాది రూపాయలు దోచుకుని, ఇప్పుడు సిగ్గు లేకుండా సెల్ఫీలు దిగుతూ ఫోజులు కొడుతున్నారంటూ, గాలి భానుప్రకాష్ రెడ్డిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా నిప్పులు చెరిగారు. పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ సచివాలయ పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని గుర్తు చేశారు. రాష్ట్రమంతటా జగనన్న సురక్ష పథకం పండుగ వాతావరణంలో అమలవుతోందని స్పష్టం చేశారు. అయితే ఇక్కడ మాత్రం పచ్చ పత్రికలను అడ్డం పెట్టుకొని ఓ కరోనా మూతోడు నగరిని పట్టిపీడిస్తున్నాడని ధ్వజమెత్తారు. తండ్రిని అడ్డం పెట్టుకొని పుత్తూరు పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, సమ్మర్ స్టోరేజి నిర్మాణాల పేరిట కోట్లాది రూపాయలను దోచేసి, నేడు సిగ్గు లేకుండా సెల్ఫీలు దిగుతున్నాడని టీడీపీ నాయకుడు గాలి భానుప్రకాష్‌పై మంత్రి మండిపడ్డారు. గుంటలు, కోనేరు మాయమవుతున్నాయని, పార్కులను కబ్జా చేస్తున్నారని పచ్చ పత్రికల్లో తప్పుడు రాతలు రాయిస్తున్నారని విమర్శించారు. ఇక్కడ కోనేరును పూడ్చి వేసింది అప్పటి తెలుగుదేశం ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు కాదా అని ప్రశ్నించారు. ఈరోజు మాట్లాడే నాయకులు ఆరోజు గాడిదలు కాస్తున్నారా అంటూ ప్రశ్నించారు. తాము ఈశ్వరాలయం అభివృద్ధిలో భాగంగా కోనేరును పునరుద్ధరిస్తూ, వెనక వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే కోనేరును కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారన్నారు. రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్క్ ఏర్పాటు చేస్తే కబ్జా అంటున్నారు.. పార్కును ఎవరు ఎలా కబ్జా చేస్తారంటూ ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లను ప్రారంభించిన టీడీపీ ప్రభుత్వం వాటిని ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. అక్కడికెళ్లి సెల్ఫీలు తీసుకోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. చెత్తపై పన్నులంటున్నారు, పుత్తూరును మున్సిపాలిటీగా చేసిందెవరని ప్రశ్నించారు. ఎక్కడెక్కడో ఉన్న గ్రామాలను కలిపి మున్సిపాలిటీ చేసి పన్నుల భారం మోపింది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. వార్డుల్లోకి వచ్చి తప్పుడు కూతలు కూసే వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చంద్రబాబు, లోకేష్, పుత్తూరు కరోనా మూతోడు, జనసేన పవన్ అందరూ తెలంగాణలో దాక్కున్నారని చెప్పారు. ఆ సమయంలో మహిళనైన తాను ధైర్యంగా ప్రజల మధ్యన తిరుగుతూ, రోజా చారిటబుల్ ట్రస్ట్ పేరిట వైద్య సేవలందించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇలా ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తనను ముచ్చటగా మూడోసారి నగరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నగరి నియోజకవర్గానికి అడిగిన ప్రతి పనిని చేసి పెడుతున్న సీఎం జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, కౌన్సిలర్లు, నరసింహారావు, పవన్‌కుమార్, వనిత, భువనేశ్వరి, జయలక్ష్మీ, భానుమతి, రాజేశ్వరి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, టీపీఓ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం – ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వి.కోట: మండలంలోని ఎగువనడిపేపల్లెకు చెందిన హలీంసాహెబ్ కుమారుడు మహ్మద్ రఫీ (42) గంజాయి అమ్ముతున్నట్లు గురువారం పోలీసులకు సమాచారమందింది. వెంటనే సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ మనోహర్, తహసీల్దార్ చిట్టిబాబుతో కలిసి నడిపేపల్లికి వెళ్లారు. అక్కడ మహమ్మద్ రఫీ వద్ద 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండు నిమిత్తం పలమనేరు కోర్టుకు తరలించారు. గంజాయి విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని సీఐ తెలిపారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జాతీయ క్రిస్టియన్ బోర్డు అధ్యక్షుడు జాన్‌మార్ష్ డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాల నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లలో క్రైస్తవులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. కొన్ని రోజులుగా ఆ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నప్పటికీ ఎవ్వరూ పరామర్శించకపోవడం అన్యాయమన్నారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను అరికట్టి శాంతి నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతి చెందిన భరత్

చిత్తూరు రూరల్: ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఫీజు సరిచేస్తుండగా షాక్‌కు గురై యువకుడు సంఘటన స్థలంలోనే మృతి చెందిన సంఘటన ఐరాల మండలంలో గురువారం వెలుగుచూసింది. తాలూకా ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కథనంమేరకు, ఐరాల మండలం చింత గుబ్బలపల్లెకు చెందిన ఆదినారాయణ కుమారుడు భరత్(20), చిత్తూరు మండలం చెర్లోపల్లి వద్ద ఉన్న జ్యూస్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఫ్యాక్టరీ కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎలక్ట్రీసియన్ రాకపోవడంతో, భరత్ ఫ్యాక్టరీకి సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్‌లోని ఫీజు సరిచేసే కరెంట్ షాక్ తగిలి కుప్పకూలాడు. సంఘటన స్థలంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచన



అన్నప్రసాదానికి ప్రత్యేక పూజలు చేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు

తిరుచానూరు(చంద్రగిరి): టీటీడీ స్థానికాలయాల్లో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు యోచిస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద గల అన్నప్రసాద భవనంలో రాత్రి వేళ కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చైర్మన్ గురువారం రాత్రి ప్రారంభించారు. ముందుగా అన్నప్రసాద భవనంలో స్వామి, అమ్మవార్ల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు రోజుకు రెండు పూటలా కలిపి దాదాపు ఒక లక్షా 30 వేల మందికి రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత ఎక్కువ మంది భక్తులు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి వస్తున్నారని, భక్తుల సౌకర్యార్థం 2007 నవంబర్ 22న ఇక్కడ అన్నప్రసాద వితరణ ప్రారంభమైందన్నారు. తోళప్ప గార్డెన్స్‌లోని అన్నప్రసాద భవనంలో ప్రస్తుతం రోజుకు 5 వేల నుంచి 6వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు ఇక్కడ అన్నప్రసాదాలు అందిస్తున్నారన్నారు. గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అదనంగా అన్నప్రసాదాలు అందించే ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. స్థానికాలయాల్లో బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాలు, రథసప్తమి, పుష్పయాగం, వసంతోత్సవాలు లాంటి పర్వదినాల సమయంలో భక్తులకు అన్నప్రసాదాలు అందజేస్తున్నామని చెప్పారు. దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో తిరుచానూరు అమ్మవారి పుష్కరిణి మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, మూరంశెట్టి రాములు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవోలు శ్రీ గోవిందరాజన్, శ్రీ సుబ్రహ్మణ్యం, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, తిరుపతి క్యాటరింగ్ అధికారి సాయిబాబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై బైక్‌ల చోరీ

- చిత్తూరులో ఇద్దరు నిందితుల అరెస్టు
- రూ.40 లక్షల వాహనాలు సీజ్



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చెడు వ్యసనాలకు బానిసై, బైక్‌లు చోరీ చేయడమే వృత్తిగా ఎంచుకున్న ఇద్దరిని చిత్తూరు టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ మద్దయ్య ఆచారి టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు నగరంలోని ఇరువారానికి చెందిన పి.జెమిని (19) ఇంటర్ వరకు చదువుకుని చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఇతను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. కొన్ని రోజుల తరువాత ఈయన బెంగళూరులో మోటారు సైకిళ్లు చోరీచేస్తూ కిందపడడంతో అక్కడి పోలీసులకు చిక్కాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన జెమిని, ఇరువారానికి చెందిన తన స్నేహితుడు శీను(20)తో కలిసి ద్విచక్రవాహనాలను చోరీ చేయడమే వృత్తిగా ఎంచుకున్నాడు. చిత్తూరుతో పాటు తిరుపతి రూరల్, తిరుపతి వెస్ట్, తిరుపతి ఎస్వీయూ స్టేషన్ పరిధిల్లో పలు మోటారు సైకిళ్లు చోరీ చేశారు. బుధవారం మధ్యాహ్నం చిత్తూరు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి, ఎస్‌ఐ నాగరాజు తమ సిబ్బందితో కలిసి ఇరువారం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు రెండు బైకులతో పారిపోవడానికి ప్రయత్నించారు. వీళ్లను వెంబడించి పట్టుకుని విచారిస్తే.. చిత్తూరు–పలమనేరు రోడ్డులోని ఓ ముళ్ల పొదల్లో దాచి ఉంచిన ఆరు ద్విచక్ర వాహనాలు, పలువురి వద్ద తాకట్టుపెట్టిన మరో 10 ద్విచక్ర వాహనాలు, నిందితుల ఇళ్ల వద్ద 5 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాల విలువ రూ.40 లక్షలకు పైనే ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. వీటిలో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ధర పలికే మోటారు సైకిళ్లు పదికిపైనే ఉన్నాయి. వీటిని రూ.15 వేలకు కుదువపెట్టి నిందితులు ఇద్దరూ జల్సాలు చేసేవాళ్లని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన సిబ్బంది హరిప్రసాద మధు, దరణికుమార్, తవరాజ్, భాష, సెంథిల్‌ను డీఎస్పీ అభినందించారు.